# ఇద్దరు మిత్రులు

ఇద్దరి వయసుల్లో ఒక యేడాది తేడా. సుదర్శనరెడ్డి పెద్దవాడు. ఈ యిద్దరూ పుట్టింది పెరిగింది రాష్ట్రంలో ఉత్తర దక్షిణాలైనా వుద్యోగ రీత్యా కలుసుకున్నది ఒకచోట. పెళ్లి కాకముందు యిద్దరూ ఒక్క గదిలోనే వుండేవారు. ఇద్దరి పెళ్లిళ్లూ యించుమించు ఒక యేడాదిలోయైనా, వినాయకరావు పెళ్లి ముందు అయ్యింది. వేరే యిల్లు చూసుకుని కదిలినవాడు అతడే. రెండు కుటుంబాలూ తరుచు మొదట్లో కలుసుకున్నా రానురానూ యెవరి సమస్యలతో వాళ్లు అనుకోకుండా దూరమయ్యారు.

సుదర్శనరెడ్డి సూటిగా పోయే మనిషి కాబట్టి సేవకునిలా సేవ చేస్తాడని, రాజులా అనుభవించడని కార్మిక వుద్యమంలోకి లాక్కున్నారు. ఉద్యోగంలో వున్నతికి పాటుపడకుండా కార్మికుల కోసం పాటుపడ్డాడు.

రానురానూ కార్మికుల్లో చెప్పేవాళ్లే యెక్కువకాగా, చేసేవారు తనొక్కడైపోయి లోకువైపోయాడు. మేనేజ్‌మెంట్‌కు షాకు తినిపించడానికి ఈ వైరులో విద్యుత్తు ప్రవహించలేదని యిలా వివాదాలు లేవదీసి, చిత్తుచేసి ఓడించి యూనియన్ పదవి నించి దించేసారు. వేళకి సరిగ్గా తిండి నిద్దర లేక, సమస్యలతో ఈ కార్మిక సేవ అతనికి ప్రసాదించింది అజీర్ణ రోగం, అయాసం.

వినాయకరావు తన పనిలో మనసు లగ్నం చేసాడు, ప్రయివేటుగా నైట్ కాలేజీలో చదువుతూ పట్టభద్రుడయ్యాడు. విసుగు విరామం యెరక్కుండా నలుగురితో సామరస్యంతో పని చెయ్యటం ఒక అలవాటుగా పెట్టుకున్నాడు. అందుకే యితను అంచెలంచెలుగా యెదిగి ఆఫీసరైపోయాడు. ఆఫీసరెప్పుడయ్యాడో ఒకచోట వుండకుండా ఎన్నో ప్రదేశాలకు బదిలీమీద తిరిగాడు.

ఇది ఈ ఇద్దరి మిత్రుల పూర్వరంగం. ఇప్పుడు ఇద్దరూ సర్వీసు నించి రిటైరయ్యే సమయం. వినాయకరావును అందుకే తను కోరుకున్నట్లు మొదట యేవూర్లో వుద్యోగంలో చేరాడో ఆ వూరికే బదిలీ చేసారు. బదిలీమీద రాగానే -

"సుదర్శనరెడ్డి యే సెక్షనులో వున్నాడ"ని అడిగితే

సెలవులో వున్నాడని విన్నాడు.

రిటైరయ్యే ముందు గవర్నమెంటుకు కలిసిపోకుండా, వున్న సెలవు తీసుకోవడం రివాజే కదా అనుకుంటే "కాదు, యేడాదై అతని ఆరోగ్యం సరిగ్గా లేద"ని విన్నాడు.

ఊర్లో లేడు. కూతురింటికి వెళ్లాడు. అక్కడ యెవరో అయుర్వేద వైద్యుడున్నాడట.

తను చార్జి తీసుకున్నప్పుడు సామాన్లు, డబ్బు, లెక్కల జాబితాలు కొంత శాతం తనిఖీ చేయటం రివాజు! అలా చేస్తున్నప్పుడు చప్పున తన అనుభవంతో ఒకచోట కాస్త గందరగోళం జరిగిందని అనుమానం కలిగింది. తన అనుమానం తప్పో ఒప్పో తేల్చుకోవాలి కదా! ఏదైనా గల్లంతు చేసేవాళ్లు దొరికిపోకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నా, యెక్కడో ఒకచోట ఒక చిన్న కన్నం వుందని తెలుసుకోలేడు. ఆ గల్లంతును కనిపెట్టినవాడు, ఆ కన్నంకోసం ముందు వెతికి దానిని కనుగొంటే అందులోనించి లోనికి చూసి జరిగిన మోసం బట్టబయలు చేస్తాడు. ఈ గల్లంతుకు సంబంధించిన కాగితాలు ఒక ఫైల్లో లేవు. పోనీ యిక్కడ పొరపాటున యెక్కడో పడేసుంటాడని ఈ సామానుకు సంబంధించిన యింకో సెక్షనుకు వెళ్తే అక్కడ లేవు. ఇలా మూడు కాపీలా నిదర్శన పత్రాలు గల్లంతు కాగానే యిక చివర కాపీ నాలుగోది వుండవలసిన సెక్షనుకు వెళ్లాడు. ఆ సెక్షను పెద్ద వీరాస్వామిని పక్కకు పిలిచి తనకు కావలసిన పత్రాల గురించి అడిగాడు. వినాయకరావును తన వెంట తీసుకువెళ్లి భద్రంగా గోద్రెజ్ బీరువా లోపలి అర తాళం తీసి పత్రాలు బయటకు తీసాడు. అవి తీసుకున్నట్లు రసీదు యిస్తూ "ఆ బీరువా లోపల వెంకటేశ్వరస్వామి ఫోటో అంటించారు. ప్రతి యేడాదీ తిరుపతి వెళ్తుంటారా?" అడిగాడు.

"తిరుపతి ఒక్కసారైనా వెళ్లలేదు."

"ఆ దేవుని నమ్మినవాడిని కాబట్టి ఈ పత్రాలను మిగతా వాళ్లలా చింపేయలేదనుకున్నాను."

"నన్ను నేను మోసగించుకోకపోయినన్నాళ్లు దేవుడు నాలో వున్నాడనే అనుకుంటానండీ!"

వినాయకరావు వీరాస్వామి భుజం తట్టుతూ "నా సర్వీసులో పూర్తి నిజాయితీతో యిద్దరే తారసపడ్డారు. ఒకరు మీరు... ఇంకొకరు సుదర్శనరెడ్డి... అంత నిజాయితీతో కార్మిక సేవ చేసాడు."

వీరాస్వామి చూస్తున్నవాడు సుదర్శనరెడ్డి పేరు వినగానే తలదించేసాడు. "ఏం ఒక్కసారి అలా తలదించేసారు?"

"సుదర్శనరెడ్డి ఈ గేంగ్ లో వున్నాడు."

"నేను నమ్మను.. నమ్మనంటే నమ్మను."

"ఆ కాగితాలు సావధానంగా చూడండి, మీకే తెలుస్తుంది" అంటూ ఆగిపోయాడు. వినాయకరావు తన ఆఫీసు గదిలోనికి వచ్చి ఆ పత్రాలను పరీక్షించి చూసాడు. ఎక్కడా సుదర్శనరెడ్డి సంతకం లేదు. జీవితంలో యెన్నడూ యిదివరకు పడని సంకట పరిస్థితిలో వినాయకరావు యిరుక్కున్నాడు. వీరాస్వామి మాటలు నమ్మకుండా వుండలేదు. ఒకవేపు మిత్రునిమీద మమకారం, యింకో ప్రక్క ప్రభుత్వవుద్యోగిగా తన విధి కర్తవ్యం మధ్య మూడు రోజుల వరకూ నలిగిపోయాడు. అన్యాయాన్ని అరికట్టకపోతే అంతులేకుండా యెదిగిపోతుంది. అప్పుడు న్యాయం చింతించినా ప్రయోజనం లేదు. ఇకముందు యిలా జరగకుండా వుండాలంటే యిప్పుడు యిది బయటపెట్టాలి. జరిగినమోసాన్నీ ప్రభుత్వ సరుకుల దురుపయోగాన్నీ తన పైఅధికారికి

పత్రాలతో సహా వివరంగా తెలియపర్చాడు. వీటికి సంబంధించి జరిగిన విస్తృతమైన విచారణలో సుదర్శనరెడ్డిమీద కూడా అభియోగం నడిచింది. కొన్న నెలల పాటు జరిగిన ఈ తతంగంలో ఆ సంబంధించిన వ్యక్తులు, మానసికంగా, ఆర్థికంగా చాలా యిబ్బందులకు లోనయ్యారు. వాళ్లకు వచ్చినదానికన్నా పోయిందే హెచ్చేమో? అసలైనది పరువు ప్రతిష్టలు దెబ్బతిన్నాయి. వాళ్ల తప్పులకు తగ్గట్లు దండనలు పడ్డాయి. సుదర్శనరెడ్డికి రిటైరయ్యేటప్పుడు రావలసిన డబ్బులో కోతలు పడ్డాయి.

ఒకనాటి వుదయం. ఇంకా సరిగ్గా తెల్లవారలేదు. గేటు తలుపు తీసిన చప్పుడు. ఎవరని చూస్తే సుదర్శనరెడ్డి. వినాయకరావు తన సర్కారు బంగళాలోనికి వచ్చిన మిత్రుని మిత్రునిగా ఆదరించాడు. చేతిలో ఈ అభియోగానికి సంబంధించిన కాగితాలున్నాయ్. వేడి టీ త్రాగాక సుదర్శనరెడ్డి అన్నాడు: "ఒక మిత్రునిగా నిన్నో సలహా అడగటానికి వచ్చాను."

"అడుగు" అన్నాడు వినాయకరావు.

"ఈ కేసు విషయం అంతా నీకు తెలుసు. దీని మీద అపీలు పెట్టడానికి నిశ్చయించుకున్నాను. అపీలు రాయించాను. ఒకసారి సరిగ్గా వుందో లేదో చూస్తావా?"

"చూడ్డానికి నాకేం అభ్యంతరం లేదు. సరిగ్గా వుందో లేదో చెప్పగలవాడు ఒక్కడే వున్నాడు"

"ఎవరు?"

"నువ్వే?"

"నేనా?"

"ఆఫీసులో దొరికిన పత్రాలు చూపించిందే నాకు తెలుసు. నీకు పూర్తి నిజం తెలుసు."

"అయితే అపీలు కాగితాలు చూడనంటావ్?"

"చూడననలేదు. చూసాక నేనిచ్చిన సలహా అసలైన సలహా కాదు."

"చూడకుండా అసలైన సలహా చెప్పాలంటే చెప్పు."

"జీవితంలో తప్పులు చేస్తున్నామని తెలియక తప్పులు చేస్తాం. విధిలేకపోతే తప్పని తెలిసి మరీ తప్పు చేస్తాం. మొదటి రకం తప్పులు తప్పులు కావు. వాటిని దేముడు క్షమిస్తాడు. రెండో రకం తప్పులకు దేముడు వరకూ యెందుకు, చేసిన మనిషే తనను తాను యేదో ఒక రోజున క్షమించలేడు. నీవు నేరంలో భాగస్వామివి అవునో కాదో ఆ నిజం నీ ఒక్కడికే తెలుసు. నిజంగా నీకేమీ సంబంధం లేకపోతే తప్పక అపీలుకు వెళ్లు - సంబంధం ప్రత్యక్షంగా వుంటే మనిషి ద్వారా ఈ శిక్ష దేముడే వేసి ఈ పాపాలు కడిగేసాడని సంతోషించు."

ఇంత పెద్ద సమాధానం విన్నాక ఆ కాగితాలన్నీ వినాయకరావుకు చూపించకుండా సుదర్శనరెడ్డి తన చేతి సంచిలో వేసుకున్నాడు. లేచిపోతూ "అపీలుకు పోతాను" అన్నాడు.

సుదర్శనరెడ్డి వెళ్లిపోయాక అతను అంత ధాటీగా చెప్పాడంటే తనీ నేరం చెయ్యనివాకి శిక్షపడడానికి కారకుడయ్యాడని వినాయకరావు బాధపడసాగాడు. పదవీ

విరమణ వలన రాబోయే తీరుబడిలో నిత్యం అన్యాయం చేసానన్న బాధల వూబిలో చిక్కుకుంటానని, పూర్తి నిజం తెలుసుకోడానికి వినాయకరావు ప్రయత్నిస్తూనే వున్నాడు. సూటిగా అడిగితే మాకు తెలీదన్నవాళ్లే. ఆఫీసరెదురుగా నిజం చెప్పితే యేంవస్తుందోనన్నభయం. మధ్యవర్తుల ద్వారా నిజం తెలుసుకోడానికి ప్రయత్నించాడు. అపీలు వేసాడని కొందరు; పెద్ద లాయర్లకి చూపించడానికి వెళ్లాడని మరికొందరూ యిలా యేవేవో గాలికబుర్లేగానీ కోర్టునించి సమన్లు వస్తేనే, అపీలు వేసినట్లు లెక్క అనుకున్నాడు.

"సుదర్శనరెడ్డి డబ్బు చేసుకోవాలనుకుంటే యూనియన్ ప్రెసిడెంట్ గా వున్నప్పుడే చేసుకునేవాడు. హోదాకే ప్రాకులాడి వుంటే అనాడే వాడిని పైకెత్తేసేవారు. అతను చేస్తాడంటే నమ్మలేం." తనకిదివరకున్న అభిప్రాయాన్నే యింకొకరి నోట వినగానే వినాయకరావు మనసు గగ్గోలు పెట్టింది. వీరాస్వామిని యింటికి పిలిపించాడు. ఇంకో మిత్రునికి తన బాధ చెప్పుకున్నట్లు చెప్పుకున్నాడు.

"అయ్యా! డబ్బుకు సుదర్శనరెడ్డి చాలా యిబ్బంది పడ్డాడండి. రాబడి తక్కువ, ఖర్చు యెక్కువ అందులో పెళ్లిళ్లు, పురుళ్ళు, పుణ్యాలు. కాజేసేవాళ్లే యితని అవసరం చూసి అందులోనికి లాగి వుంటారు. మీరు నిజం అని నమ్మిన పని చేసారు. అది ఒకరికి అన్యాయమనిపించినా మీ న్యాయంతో మీరు ప్రవర్తించారు. ఇందులో బాధపడవలసినదేమీ లేదు."

వీరాస్వామి ఇంత పెద్ద ఓదార్పుతో వినాయకరావు తనను తానే సమర్థించుకున్నాడు. కొద్ది నెలలు గడిచాయి. ఒక రోజు సాయంత్రం తనకో సమాచారం అందింది. సుదర్శనరెడ్డి ఫలానా అసుపత్రిలో ఫలానా వార్డులో పదిహేనో నెంబరు బెడ్ మీద వున్నాడనీ, తనని చూడాలని కోరుతున్నాడనీ కబురొచ్చింది. మరుసటి రోజు వెళ్లేసరికి సుదర్శనరెడ్డి స్పృహతప్పి వున్నాడు. ముక్కులో గొట్టాం యెక్కించి వున్నారు. గ్లూకోజ్ యెక్కించారు. మెల్లగా సుదర్శనరెడ్డి మంచం దగ్గరకు వినాయకరావు వెళ్లగానే అటువేపు నిల్చున్న రెడ్డి భార్య, తనవేపు యెగాదిగా కళ్లెర్రజేసి చూసింది. గబగబ బయటకు వెళ్లిపోయింది: వార్డుబోయ్ "అవిడ బయట వుంది. పిలుస్తోందని" కబురు తెచ్చాడు. ఏం చెప్తుందోనని యిలా వరండాలోనికి వెళ్లాడో లేదో, రెడ్డి భార్య వార్డంతా వినిపించినట్లు కేకలు –

"నువ్వెందుకొచ్చావ్? నీ నుంచే నా మొగుడు చచ్చిపోతున్నాడు – నువ్వే నా మొగుణ్ణి ఖూనీ చేసావ్! పో.. పోతావా లేదా?" అలా హిస్టీరియా వచ్చిన మనిషిలా అరుస్తుంటే మెల్లగా తలవంచుకుని వినాయకరావు మెట్లు దిగిపోయాడు.

తిరిగి వచ్చాక మళ్ళీ వినాయకరావు మనసు మహా సముద్రం అయిపోయింది. కబురు తెలిసిన వెంటనే వెళ్లి వుంటే యేం చెప్పేవాడో? కనీసం సైగలతోనైనా తనొక్కడికే తెలిసిన పూర్తి నిజం చెప్పి, తను పోయినా తన ఔదార్యాన్ని, గొప్పతనాన్ని చూపించేవాడేమో? వినాయకరావు కల్లోలమైన మనసు అఫీసు దరిదాపుల్లోనికి వెళ్లనివ్వలేదు. ఒకప్పుడు అప్యాయతతో "చెల్లెమ్మా!" అని అవిడని పిల్చేవాడు. "అన్నయ్యా!" అని అవిడ ఆదరించేది. అదే నోరు అంత కఠినంగా పలకడంతో తట్టుకోలేకపోయాడు. సెలవు తీసుకుని మనశ్శాంతి కోసం గీతాపారాయణం చేశాడు.

"ప్రభుత్వ నిధులు గల్లంతు కావడం నిజం. అది అబద్ధం కాదు. గల్లంతు కొందరు కలసి ఒక పన్నాగం పన్ని చేసారన్నదీ నిజమే. ఈ పన్నాగంలో తన మిత్రుడువున్నాడా, లేదా? లేడేమో? ఒకోసారి తప్పు చెయ్యనివాళ్లు నేరస్తులుగా ముద్రపడటం జరుగుతుంటుంది కదా!" దొరికిన పత్రాలు వీరాస్వామి లాంటి నమ్మకస్తులూ తన మిత్రుడు సుదర్శనరెడ్డి ఈ పన్నాగంలో చేరి వున్నాడని చెప్తున్నారు. అదే సుదర్శనరెడ్డి నోట విని వుంటే తన చింత అంతా పోయేది. స్నేహ రుచి ఒకనాటిదైనా, నిత్యం లాలాజలంలా నిర్చిపోతుంది. ఒక స్నేహితుని పతనానికీ, చావుకూ తనే కారకుడన్న అభియోగం, ఒక ఖూనీకోరుపై వేసిన అభియోగం వంటిదే! ఇది తన మనసులోనించి పోవాలంటే రెడ్డి తన తప్పును ఒప్పుకుంటేనే!

రిటైరయ్యే ముందు అఫీసులో వినాయకరావు చేరాడు. ఒకనాడు రెడ్డి కొడుకు తన తండ్రికి రావలసిన మెడికల్ బిల్లు విషయం తెలుసుకోడానికి వచ్చాడు.

వాడిని యెదరగా కూర్చోబెట్టి –

"మీ నాన్న అపీలుకు కోర్టుకు వెళ్తానని నాతో చెప్పాడు. వెళ్లాడా?" అనడిగాడు.

"ఆ పేపర్లు లాయర్లకు యిచ్చాడండీ. మళ్లీ మరుసటి రోజు వెళ్లి తెచ్చేసాడండీ. ఎన్నిసార్లు చెప్పినా చూద్దాం, చూద్దాం.. టైముందని అనేవాడు."

"ఆ కాగితాలు మళ్లీ లాయరుకు ఇవ్వలేదా?"

"లేదండీ – నాన్నగారు బీరువాలో తాళం వేసుకుని మరీ వుంచారు. అసుపత్రిలో చేర్చేముందు ఈ కాగితాలు గురించి అడిగాను."

"ఏమన్నాడు?"

"నాకో మిత్రుడున్నాడు. అతనొక్కడే నాకు సరైన సలహా యిచ్చాడు. ఆ కాగితాలు బీరువాలో లేవు. ఏనాడో చింపేసానని చెప్పాడండీ!"

వినాయకరావుకు యెందరో మిత్రులున్నారు. అందులో గొప్ప మిత్రుడు రెడ్డి అన్న నిర్ధారణకు వచ్చి, కన్నీళ్లతో అతని స్మృతికి నివాళులర్పించుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి దీపావళి సంచిక, 1990)

(హిందీ అనువాదం: దక్షిణ భారత హిందీ ప్రచారసభ పత్రిక – మార్చి, 1992)

* * *